# దేశానికి రోల్ మోడల్ తెలంగాణ


లక్ష్మీదేవిపల్లి: సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు


ములకలపల్లి : తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఇల్లెందు : జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్


పినపాక తహసీల్ కార్యాలయంలో..


అన్నపురెడ్డిపల్లి : జెండా ఆవిష్కరిస్తున్న సుధాకర్

**కేసీఆర్ పాలనలో సబ్బండవర్గాల సంక్షేమం**
**అమరవీరుల త్యాగం మరువలేనిది**
**రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు**
**జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు**

తెలంగాణ రాష్ట్రం అనేకరంగాల్లో దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ సహా వివిధ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అన్ని కార్యాలయాల్లోనూ జాతీయ పతాకాలను ఎగురవేశారు. అమరువీరుల స్తూపాలకు, తెలంగాణ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఉద్యమంలో అప్పటి ప్రభుత్వాల నిర్బంధాలను, కేసీఆర్ సారథ్యంలో నాడు జరిగిన ఉద్యమ ఘట్టాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఉద్యమసారథి నాయకత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా 14 ఏళ్లు సాగిన పోరాట ఘట్టాలను నెమరువేసుకున్నారు. కొత్తగూడెంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి, తెలంగాణ అమరవీరులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన అమరుల త్యాగం మరువలేనిదన్నారు. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో సబ్బండవర్గాల సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లపాటు పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని ప్రగతివైపు నడిపించారని కొనియాడారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియనాయక్, మెచ్చా నాగేశ్వరరావు, దిండిగల రాజేందర్, రామకృష్ణ, కాపు సీతాలక్ష్మి, దామోదర్ పాల్గొన్నారు. **– నమస్తే నెట్‌వర్క్, జూన్ 2**


చర్ల : బీఆర్ఎస్ కార్యాలయంలో..


బూర్గంపహాడ్ : ఉద్యమకారులను సన్మానిస్తున్న నాయకులు


పాల్వంచ : కేటీపీఎస్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీఈఈ జాక్ నాయకులు


పాల్వంచ రూరల్ : ఎంపీడీవో కార్యాలయంలో


భద్రాచలం : ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చంద్రుగొండ: రాష్ట్ర అవతరణ వేడుకలు


మణుగూరు టౌన్ : డీఎస్పీ కార్యాలయంలో..


అశ్వాపురం : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద..


కొత్తగూడెం ప్రగతి మైదాన్ : జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ


ఇల్లెందు : జాతీయజెండా ఆవిష్కరిస్తున్న జడ్జి


కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం కోర్టులో..


పాల్వంచ : నవభారత్ వద్ద...


రామవరం : జెండా ఆవిష్కరణలో టీబీజీకేఎస్ నాయకులు


కరకగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..

## రేపు హెడ్డాఫీస్ ఎదుట నిరాహార దీక్ష


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, జూన్ 2 : తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన చేయనున్న నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నేతలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, దిండిగల రాజేందర్, రామకృష్ణ, కాపు సీతాలక్ష్మి పాల్గొన్నారు.

## త్యాగాల ఫలితమే రాష్ట్ర ఆవిర్భావం

### తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జూన్ 2: ఎందరో అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను భద్రాచలం ఐటీడీఏలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం ఐటీడీఏ ద్వారా గిరిజనులు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి పీవో వివరించారు.

## సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

భద్రాచలం, జూన్ 2: గిరిజనుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని యూనిట్ అధికారులను ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు.

## 34 కుటుంబాల చేతిలో 400 ఎకరాల ఫారెస్టు భూమి

### కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు

లక్ష్మీదేవిపల్లి, జూన్ 2 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన గొత్తికోయలు మన తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవికి ఒక క్యాన్సర్‌లా తయారయ్యారని, సుమారు 400 ఎకరాల రిజర్వు ఫారెస్టును ధ్వంసం చేసి పోడు వ్యవసాయం కోసం ఆక్రమించుకున్నారని కొత్తగూడెం డివిజనల్ ఫారెస్టు అధికారి కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక డివిజనల్ ఫారెస్టు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం డివిజన్ రామవరం రేంజ్ పరిధిలోని జగ్గారం కంపార్ట్ నెంబర్ 9లో గొత్తికోయలు సుమారు 400 ఎకరాల ఫారెస్టు భూమిని ఆక్రమించి పోడు వ్యవసాయం చేస్తున్నారని, ఆ ఏరియా పరిధిలో 34 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఒక్కో కుటుంబానికి 30 నుంచి 40 ఎకరాలు అటవీ భూమి వారి ఆధీనంలో ఉన్నాయని, వారికి ఫారెస్టు భూమిపై చట్టపరంగా ఎటువంటి హక్కులేదన్నారు. వారికి కొంతమంది రాజకీయ నాయకులు సహాయ సహకారాలు అందిస్తున్నారని, ఇలా చేయడం వల్ల విలువైన అటవీ సంపదతోపాటు వందల ఎకరాల భూమి అన్యాక్రాంతమైందన్నారు. గొత్తికోయలు వారి రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో ఇంచు అటవీభూమిని కూడా కబ్జా చేయరని, అదే మన జిల్లాలో అయితే ఎకరాలకు ఎకరాలు ఫారెస్టును ఆక్రమించుకొని పోడు వ్యవసాయం చేస్తున్నారని, లక్షల రూపాయలు ఆదాయం ఆర్జిస్తూ తాము పేదవాళ్లమే వారి వేషధారణతో సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నెలరోజుల వ్యవధిలోనే ఫారెస్టు అధికారులపై మూడుసార్లు దాడులు చేశారని, దాడికి పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# 'జేఈఈ అడ్వాన్స్‌డ్' ఫలితాల్లో..

# ప్రైవేట్ కళాశాలల సత్తా

**అత్యుత్తమ ర్యాంకులతో మెరిసిన ఖమ్మం విద్యార్థులు**

ఖమ్మం అర్బన్, జూన్ 2: జాయింట్ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్–2025 పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. వీటిల్లో ఖమ్మం నగరంలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.

### 'న్యూవిజన్' ప్రభంజనం..


న్యూవిజన్ విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం న్యూవిజన్ జూనియర్ కళాశాల మరోసారి ప్రభంజనం సృష్టించినట్లు ఆ కళాశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. ఓపెన్ కేటగిరీలో పేరాల ప్రణవ్–497వ ర్యాంకును సాధించినట్లు చెప్పారు. వివిధ కేటగిరీల్లో అజ్మీరా రోషిక్ మణిదీప్–5, పీయుష్‌వర్ధన్ రాథోడ్–102, యశ్వంత్–394, కార్తీక్‌సాయి–537, సాయికృష్ణ–556, షణ్ముఖ్–562వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. తమ కళాశాల విద్యార్థులు 2వేలలోపు 50 ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ సీహెచ్ గోపీచంద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

### 'హార్వెస్ట్'కు జాతీయస్థాయి ర్యాంకులు..


హార్వెస్ట్ విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం హార్వెస్ట్ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ తెలిపారు. సాయిచరణ్–83వ ర్యాంకు, సంజయ్–207, నాగ యశ్వంత్–393, సిద్ధార్థ్ –395, శ్రీనివాస్ గౌతమ్‌రెడ్డి–686, చరణ్‌గోపాల్–1,092వ ర్యాంకులతో మెరినట్లు చెప్పారు. తమ కళాశాల నుంచి అత్యధిక మంది ర్యాంకులు సాధించారన్నారు. క్రమశిక్షణాయుత ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతోనే ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధ్యమైనట్లు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### 'శ్రీచైతన్య' అగ్రగామి..


శ్రీచైతన్య విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు అగ్రగామిగా నిలిచినట్లు ఆ కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య తెలిపారు. జశ్వంత్‌రామ్–9, ఎస్‌వీ వీరబ్రహ్మం–92, బీ లింగేశ్–144, వీ కుషాల్–165, విక్టోరియా–199, జయంత్–221, అను–258, జ్ఞానతిక్ లక్కీ–270, అంకిత–272వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. తమ విద్యార్థులు 100లోపు 3 ర్యాంకులు, 2 వేల లోపు 65, 5 వేల లోపు 111 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, డీజీఎం చేతన్‌మాథుర్, డీన్ వర్మ, కృష్ణ, ఏజీఎంలు చిట్టూరి బ్రహ్మం, ప్రకాశ్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

### 'రెజొనెన్స్' ఆధిక్యం..


రెజొనెన్స్ విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం రెజొనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి ఆధిక్యాన్ని చాటారని ఆ కళాశాల డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. స్నేహమృధుల–89, రాకేశ్–230, అభినాయక్–342, మదన్–371, సురేశ్–557, హర్షవర్ధన్–906, శ్యామ్–1,860వ ర్యాంకులతో రాణించినట్లు వివరించారు. తమ కళాశాలకు చెందిన అత్యధిక మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఇంటర్‌తోపాటు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చాటుతున్నారన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సతీశ్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### 'కృష్ణవేణి' విజయకేతనం..

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం కృష్ణవేణి కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆ కళాశాల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. జెస్వాత్–402, మణిచంద్రసాయి–418, భానుప్రసాద్–598, బన్నీ–732, సంహిత–765, రాజేశ్వరి–798వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. 2వేల లోపు 30 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి ప్రతిభ చాటినట్లు చెప్పారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, డీన్ వంశీకృష్ణ, ఏవో నిరంజన్ అభినందించారు.


కృష్ణవేణి విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

## ఐటీడీఏ ఏసీఎంవోగా రమేష్

భద్రాచలం, జూన్ 2: భద్రాచలం ఐటీడీఏలో మానిటరింగ్ విభాగంలో ఏసీఎంవోగా రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

## బెల్లం, పటిక పట్టివేత

లక్ష్మీదేవిపల్లి, జూన్ 2 : హేమచంద్రాపురం వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ బృందం మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన అజ్మీరా గణేష్ ఆటోలో తరలిస్తున్న 108 కిలోల బెల్లం, 40 కిలోల పటిక, 5 లీటర్ల నాటుసారాని పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు డీటీఎఫ్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్ పాషా, గురవయ్య, సుమంత్, శ్రావణి, పార్థసారథి పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల పట్టివేత

టేకులపల్లి, జూన్ 2: గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా బోడు పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం కిష్టారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పదిమందిని పట్టుకున్నారు. వారి వద్ద బైకులు, రూ.3750ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## కారును ఢీకొన్న లారీ

అశ్వారావుపేట, జూన్ 2 : లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. వివరాల్లోకెళ్తే.. అశ్వారావుపేట పట్టణానికి చెందిన చారి కారులో అశ్వారావుపేట వైపు వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ఎదురు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. కారు యజమాని చారి సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదం వివరాలు సేకరిస్తున్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేట, జూన్ 2 : ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట పట్టణంలోని ఒక ప్రాంతానికి చెందిన బాలికను అదే ప్రాంతానికి చెందిన మారేష్ కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మారేష్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి తహసీల్దార్

అశ్వారావుపేట, జూన్ 2: అశ్వారావుపేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సీహెచ్‌వీ రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్‌గా ఆయన పని చేస్తున్నారు.

## 16 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 2 : ఇద్దరు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) సభ్యులతో సహా 16 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎస్పీ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ 2వ నెంబర్ కంపెనీలో పని చేస్తున్న మహిళా మావోయిస్టు రీటా అలియాస్ దోడి సుక్కి, రాహుల్ పూనెంతోపాటు మరో 14 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయినట్లు వివరించారు. వీరందరిపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు.

## అశ్వారావుపేటలో ర్యాలీ

అశ్వారావుపేట టౌన్, జూన్ 2 : అశ్వారావుపేట మున్సిపాలిటీలో సోమవారం వందరోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో పట్టణ ప్రణాళిక అధికారి వలసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో వార్డుల విభజన కోసం అభ్యంతరాలను 3 నుంచి 21వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుజాత తెలిపారు.

## పర్యావరణాన్ని పరిరక్షించాలి

పినపాక, జూన్ 2: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైన ఉందని ఈబయ్యారం ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజస్విని అన్నారు. ఆమె సోమవారం పర్యావరణ వారోత్సవాల సందర్భంగా జానంపేట రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగించి మాట్లాడారు. ప్లాస్టిక్ వల్ల జంతు జీవాలకు సైతం తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

## మెరిట్ విద్యార్థులకు సత్కారం

బూర్గంపహాడ్, జూన్ 2: బూర్గంపహాడ్, భద్రాచలం మండలాల్లో పది, ఇంటర్మీడియట్‌లో మెరిట్ మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులను ఐటీసీ ముస్లిం ఎంప్లాయీస్ నాయకులు సోమవారం సన్మానించారు.